
# ఓ మైగాడ్ !-



రచన : "శ్రీ బచ్చు వీరరాజు"

**ఆ** నగరానికి తూర్పు దిశగా ఓ సెలయేరు.

ఆ ఏరు ప్రక్కగా ఓ చిన్న కుటీరం. ఆ కుటీరంలో తండ్రితోబాటు నివసించే అప్సరస పేరు సుందరి.

శాపవశాత్తూ ఏ గంధర్వకన్యో భూలోకంలో అవతరించిందా? అన్నట్లుండే ఆ సుందరి అందమే అందం. పలుకే పలుకు, కేవలం ఆమె చూపులకోసం, పడిచచ్చే యువకులు కోకొల్లలు. వృద్ధుల్ని సైతం మతులు పోగొట్టే ఆ సుందరి రూపం అద్వితీయం, అపురూపం.

అటువంటి సుందరి, ఆ కుటీరంలో చాపమీద పడుకొని, ఆ రోజు తనకు అందిన పుత్తరాలను తీసి చదవసాగింది.

మొదటి ఉత్తరంలో యిలా వుంది.

---

నీ నరనరాల్లో వేడి క్రొన్నెత్తురు
లావాలా ప్రవహిస్తోంది!
నీ ఎదలో ఓ శార్దూలకిశోరం నిద్రిస్తోంది!
ధైర్యంగా దాన్ని కాస్త తట్టిలేపు!
అలా వెనకి కాదు!
ముందుకే వుండాలి
ఎపుడూ నీ చూపు!
ఒరేయ్ మనిషీ!
అటుకాదు!...
ఇటు చూడు నా వైపు! ॥నీదీ॥

సుందరీ!

నువ్వు కాలేజీలో చేరిన రోజే నిన్ను చూసి ప్రేమలో పడిపోయాను. నీ అందం అమోఘం. నిన్ను పొందని జన్మ వృధా! ఈ నగరంలోని ఫ్యాక్టరీలన్నీ మా నాన్నగారివే! లక్షల ఆస్థి! నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. నీ అంగీకారానికి ఎదురుచూస్తూ-

ఇట్లు
నీ ప్రేమపిపాసి
రమేష్.

సుందరి ఓసారి నవ్వుకొని, రెండో వుత్తరం తీసింది.

ప్రేమరాణీ!

భూలోకంలోని ఏ యువతి అందంకూడా నీ కాలిగోటికి సరిపోదు. నాకు నాలుగు మేడలూ, రెండు కార్లూ, ఓ థియేటరూ వున్నాయి. నేనొక్కడినే మా నాన్నగారికి సంతానం. నేనాడిందే ఆట! నేపాడిందే పాట! నువ్వు 'ఊ' అంటే రేపే మన పెళ్ళి.

నీ జవాబుకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూ,
ఆనంద్.

సుందరి మరోసారి నవ్వుకొని, అడ్రస్ చూసింది. తిరిగి మూడో ఉత్తరం తీసింది.

హృదయరాణీ!

నిన్ను చూసిన రోజునుంచీ మజ్నూనయ్యాను. నాకు



నువ్వే దిక్కు. మా నాన్న కోటికి పడగెత్తిన వ్యక్తి. నువ్వు కావాలంటే చాలు, మరో తాజ్‌మహల్ నిర్మించి యిస్తా. నన్ను నీవాడినిచేసుకో!

నీ జవాబుకోసం అలమటించే...

రాజా,

తనివితీరా మరోసారి నవ్వింది సుందరి. ఆ పుత్తరాన్ని కూడా ముందుపెట్టిన వాటిమీద పెట్టింది.

ఇంతలో తండ్రి జగన్నాథం వచ్చిన అలికిడైంది. వెంటనే సుందరి లేచి నవ్వుతూ తండ్రి కెదురెళ్ళి ఆ పుత్తరాలన్నింటినీ అందించింది.

జగన్నాథం వాటిని అందుకొని, చదివి హుషారుగా ఈలవేశాడు.

* * *

ఓ మంచి రోజున పేర్వేరు సమయాల్లో, రమేష్, ఆనంద్, రాజాలు తల్లిదండ్రులతో వచ్చి, జగన్నాథంతో సంప్రదింపులు జరిపారు.

అందరికీ సుందరి నచ్చింది. ఆమె అందం అందరికీ మతిపోగొట్టింది. కొడుకులంతా ఎందుకు సుందరినే కావాలంటున్నారో తల్లిదండ్రులందరికీ ఇప్పుడర్థమయింది.

చూపులయ్యాక, సుందరి రాజాను కోరుకుంది. జగన్నాథం పేర పదిలక్షలకు చెక్కు జారీ చేశారు రాజా తల్లిదండ్రులు. జగన్నాథం కోరికి నెరవేరింది.

ముహూర్తాలు చూసి వుంచారు. ఈ సంగతి తెలుసుకొన్న రమేష్, ఆనంద్‌లు పిచ్చివాళ్ళయిపోయారు. తిండీ తిప్పలు మానేసి దేశదిమ్మరులై వూళ్ళుపట్టిపోయారు.

ఆ సంగతి తెలిసిన సుందరి నిట్టూర్చింది. రాజా ఆనందానికి అంతులేకుండా పోయింది. ఎగిరి గంతేశాడు. ముహూర్తపు రోజు గురించి క్షణమొక యుగంలా ఎదురు చూడసాగాడు. ఈలోగా ఎన్నో బహుమతులు, జరీచీరల రూపంలో, ఆభరణాల రూపంలో సుందరి నలంకరించాయి. సుందరి పొంగిపోయింది.

* * *

పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. లక్షలకు లక్షలు నీళ్లల్లా ఖర్చు చెయ్యబడ్డాయి.

ఆ రాత్రే శోభనం! రాజా హుషారుకు అంతే లేదు. గాలిలో తేలిపోతున్నాడు.

రాజా ఆత్రుతగా తలుపు గడియపెట్టాడు. ఆ చప్పుడు విన్న రాజా తల్లిదండ్రులు లోలోపలే నవ్వుకుని, మేడపైకి వెళ్ళిపోయారు.

* * *

సుందరి సిగ్గుపడుతూ, మంచంమీద కూర్చుంది. రాజా తటాలున దగ్గరకొచ్చి గట్టిగా కౌగలించుకొని ముద్దుపెట్టుకొన్నాడు. సుందరి తలవంచుకొంది.

రాజా ఆత్రుతగా సుందరిని మీదకు లాక్కొని మంచం మీద వాలిపోయాడు. నెమ్మదిగా లైట్ తీసేశాడు. బెడ్ లైటు వెలుగుతోంది. రాజాలో ఉద్రేకం కట్టలు త్రెంచుతోంది. సుందరి భయంతో కంగారు పడిపోతోంది.

ఇంతలో సుందరి హఠాత్తుగా 'క్షమించాలి! నేనింకా పూర్తిగా ఆడతనాన్ని పుంజుకోలేదు' అంది తల ప్రక్కకు పెట్టుకొని.

'వాట్?' ఒక్కసారి అదిరిపడ్డాడు రాజా.

'అవునండీ! నా పేరు సుందరం. మాది రేపల్లె! చాలా బీదవాళ్ళం. నాలో స్త్రీ లక్షణాలు కనబడుతూ వుండటంతో సుందరిగా పేరు మార్చుకొని, ఆ వూళ్లో వాళ్ళ సూటు, పోటు మాటలు పడలేక ఇక్కడికొచ్చి నా చదువు సాగించబోయాను. ఆపరేషన్ చేస్తే పూర్తి ఆడదానిగా మారతానని డాక్టర్లు చెప్పారు. మా నాన్నగారు డబ్బు గురించి ప్రయత్నం చేస్తే, ఎక్కడా కుదరలేదు.

ఈ లోపుగా మీరు నన్ను ప్రేమించడం... పెళ్ళిచేసుకోవడం... ఒక్కసారి ఆగింది సుందరి.

అప్పటికే స్పృహతప్పి మెడ వాల్చేశాడు రాజా.